# తీర్పు

## రాయని కవి

ఆడపిల్ల పుట్టిందంటే, ఛా! అదేం ఖర్మం! మొగపిల్లాడే పుట్టాడని నేను నా ప్రాణేశ్వరీ వాదులాడుకున్నాం. 'ఆడపిల్లయితే జార్జెట్టు సిల్కుచీర గోల్డునెక్లేసు కొనియ్యాలండీ' అంది ప్రాణేశ్వరి పార్వతి. కానిపిల్లాడైతే మీ నాన్నతో చెప్పి సెర్జిసూట్, వెస్టెండ్ వాచ్ కొనిపించాలిసుమా, అని నేను పందెం వేసేను —

ఇంతకీ మొగరాయుడ్ని కదా ఎంతచెడినా, పిల్లాడు కాకపోతే మన పురుషత్వంకే లోటు కాదా? మొట్టమొదటలోనే గుమ్మడి పండు లాంటి పిల్లాడ్ని కన్నాడే అని నలుగురూ పొగడాలనే ప్రకృతి సహజమైన అభిలాషొకటి, ఉండదండీ ప్రతిపురుష పుంగవుడికీ! అందులో నాలాంటివారి సంగతి వేరే చెప్పాలా? అదేకాక కొంపతీసి ఆడపిల్లేగాని పుట్టుకొస్తే, పెళ్లీ పెడాకులూ చేయాలనే బెంగొకటి ఈ వరకట్న మహామారి రోజుల్లో. పురుటిరోజులు దగ్గరకొచ్చేసరికి ఇలా ద్వందభావాలతోనే తప్పనిసరిగ వాళ్ళ పుట్టింటికి దాన్ని పంపేశాను.

పెళ్లాన్నైతే పంపించేసానేగాని పురుటిఫలితం మీద అల్లల్లాడే మనస్సు మాత్రం మరల్చుకోలేకపోయేను. ఏదో మగపిల్లాడైతే మహా ఉద్ధరిస్తాడనే పిచ్చి భ్రమ పోలేదీ అమాయిక హృదయానికి- చూస్తూనేయున్నాంగా ఒక్కొక్కడు ఎంతెంత ఉద్ధరించేది- మనమెంత చేస్తున్నామో మన పిల్లలూ అంతే నిరవాకం చేస్తారు. కొట్టి తిట్టకుండా యుంటే పూజించినంత ఫలం!

పందెం గెలుస్తానో లేదో అనే శంక తీర్చుకుందామని ఎక్సుపర్ట్ పామిస్టు ఫ్రెండ్ శర్మని కలుసుకున్నా. వాడెప్పుడూ ఇంతే- పాము చావకుండా, కర్ర విరగకుండా సమాధానం చెప్పేడు. ఓటమి అన్నది ఈ ఏడాదిలోగా కలలో కూడా ఎరుగని సంఘటననీ, కాని ఈకేసులో మాత్రం గెలుపు సందేహాస్పదమని, ఏమంతగా ఉబలాటపడతగింది కాదనీ చెప్పేడు ఎక్స్పర్టట. ఎక్స్పర్ట్! వెధవాయ్! నీ మొహంలావుంది నీ పామిస్ట్రీ నువ్వూ' అని వాడ్ని ఛడామడా తిట్టేశాను.

పార్వతికి తొమ్మిదోమాసం నిండుతూన్నదనగానే, దగ్గర్లోనే మేనమామ కూతురవడంచేత సిగ్గుపడక్కర్లేకుండా వాళ్ళింటికెళ్లా. నొప్పులు

మంత్రసాన్ని తొందరగా పిలిపించేం. 'మీరు కాస్త నింపాదిగా ఉండండి చిన్నబాబుగారూ! మరో పావుగంటకల్లా పురుడొస్తుంది. కాస్త దూరంగా విశ్రాంతి తీసికోండి. ఇక్కడ తల్లికేం కంగారు పడనీయకూడదు' అంది.

నేనూ మామామ కలిసి సావిట్లో 'చెస్సు' వేసుకున్నాం టైమ్ కిల్ చెయ్యడానికని. మనస్సులోని ఆందోళనా వేదనలచే ఎత్తు సరిగా పడితేగా మరి! ఆట హంసగమనంతో నడిచింది. మనస్సంతా పిల్లా, పిల్లవాడా అనే ధ్యాసే ఐతే ఇంకేమవుతుంది. 'అదేవిటోయి! 'సెగటు' తీస్తే రాజవుతుందే! ఆ సెగటు ముట్టుకోలేవన్నారు మామగారు. ఇంతలోకల్లా పెద్దకేక వేసుకుంటూ మంత్రసానొచ్చి "వెంటనే లేడీడాక్టరుని పిలిపించాలి. చాలప్రమాదం. నాచేత మరి వీలుకాదు" అంది.

ఈ వైద్యవృత్తిలో యున్నవాళ్ళంతా ఇంతే. ప్రాణం క్షణమో, ఘడియోలోనో పోతుందంటే నాచేత మరి కాదంటారు. అంతదాకా నీళ్ళనములుతూ -

ఎలాగైతేనేం చేరువులోనేఉన్న లేడీడాక్టర్ని కాళ్ళావేళ్ళా పడి తీసికొచ్చేం. ఇంట్లో గలాటా, ఆక్రందనాలు చెప్పక్కర్లేదు.- శాంతంగా ఉండండని వాళ్ళని మందలించి పార్వతిని చూడ్డానికెళ్లిందామె. నాడి చూస్తున్నంతసేపు అక్కడవున్న వాళ్ళలో ఒక్కరికీ మొహంలో రక్తపుచుక్కంటే లేదు. 'మరేం పర్వాలేదని' ఆవిడ చెప్పిన మీదట అంతా నింపాదిగా దూరంగా పోయేం. కొంతసేపటికి కెవ్వుమని పిల్లకేక వినిపించింది. మంత్రసానొచ్చి "చక్కని చుక్కలాంటి పిల్ల పుట్టింది బాబూ" అంది. నిరాశచే నా మొహం మాడిపోయింది. అయినా పెద్దప్రాణందక్కి, తల్లీ పిల్ల, కులాసాగానున్నారని సంతోషించేను. ఇంకొద్దిసేపటికి మళ్ళా చంటిపిల్ల కేక కొంచెం మార్పుతో వినపడ్డది- "లక్కీట్విన్సు, అచ్చంగా మొదటి పిల్లలాంటి పిల్లాడు పుట్టేడని" లేడీడాక్టరు నన్నభినందించింది.

నేను మాత్రం సందిగ్ధావస్థలో పడ్డా. సంగతంతా చెప్పి, 'నిష్పాక్షికంగా మీరే తీర్చాలీ సమస్యని' మా మామగార్నే వేడుకున్నా పందెం విషయమై. 'ఓస్. ఇంతేనా' అని కాస్సేపు నిదానించి "అమ్మాయి మాటప్రకారం మొదట ఆడపిల్లే పుట్టింది గాబట్టి దానికో సిల్కుచీర, నీ మాటప్రకారం పిల్లవాడుకూడా పుట్టేడు కాబట్టి నీకో సెర్జిసూట్ నేనిస్తాగా" అన్న మామమాట